క్లుప్తంగా

ధర్నాకు తరలిరావాలని పిలుపు

జగ్గయ్యపేటఅర్బన్: విజయవాడ వరద బాధితులకు అండగా గురువారం ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో చేపట్టే ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద బాధితులకు అండగా నిర్వహించే ఈ ధర్నాలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు పాల్గొంటారని తెలిపారు. ఈ ధర్నాకు నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



జుజ్జూరు(వీరులపాడు): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో అరుంధతీదేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండ రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పరిపాలనా విధానం, పంచాయతీ రాజ్ చట్టాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై అవగాహన కలిగించేందుకే ప్రభుత్వం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, మౌలిక వసతుల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి రైతులకు సూచనలు



కంచికచర్ల: మండలంలోని కీసర, వేములపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరులకేంద్ర ఏడీఏ మోనీషా మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు పలు ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మరికొన్ని చోట్ల పత్తి పంట బాగానే ఉందన్నారు. ఆయా పంటల సంరక్షణకు రైతులు తప్పకుండా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. పత్తి పంటలో తెల్లదోమలు ఆశించకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.విజయకుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయ సంచాలకులు వీరబాబు, అనిల్ గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ వేడుకలు



జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. శ్రీరంగ నాయకస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని బ్రాహ్మణ బజారులోని మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణ మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో పట్టణ మహిళా సమాఖ్య మహాజన సభ మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎ.సత్యావతి అధ్యక్షతన బుధవారం నిర్వహించగా, నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా షేక్ నజీమున్, ఉపాధ్యక్షురాలిగా కాకాని పావని, కార్యదర్శిగా గోనెల పద్మ, సంయుక్త కార్యదర్శిగా అనపర్తి పద్మ, కోశాధికారిగా కోమటి ఝాన్సీ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మెప్మా సీవోలు నిర్మలకుమారి, వెంకట్, శ్రీదుర్గ, టీఎల్ఎఫ్ ఆర్పీ లావణ్య, ఓబీ సభ్యులు పాల్గొన్నారు.

గండ్లు పూడిస్తేనే సాగు

- వరదలకు తువ్వకాలువకు భారీగా గండ్లు
- కొట్టుకుపోయిన పంట పొలాలు
- కోతకు గురైన భూములు
- గండ్లుపూడ్చాలని రైతుల డిమాండ్



తువ్వకాలువకు పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద పడిన భారీగండి



తువ్వకాలువకు గండిపడటంతో ఏర్పడిన గొయ్యి



ముచ్చింతాల వద్ద కోతకు గురైన పంట భూమి

పెనుగంచిప్రోలు: గతనెలలో కురిసిన భారీవర్షాలు, సంభవించిన వరదలకు మునేరు పక్కన ఉన్న తువ్వకాలువకు 50చోట్ల వరకు గండ్లు పడటంతో ఆయకట్టు పరిధిలోని మాగాణి పొలాలు దారుణంగా దెబ్బతిన్నాయి. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేములనర్వ వద్ద నాలుగు పెద్దగండ్లు, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద ఓ పెద్దగండి పడింది. ఒక్కో గండి 100 నుంచి 200మీటర్ల మేర పడటంతో ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు తుడిచిపెట్టుకుపోయాయి.

1200ఎకరాల సాగువిస్తీర్ణం..

తువ్వకాలువ కింద వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు నుంచి పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రు వరకు సుమారుగా 1200ఎకరాల్లో మాగాణి సాగవుతోంది. వరద నీటికి వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, వేములనర్వ, పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, వెల్లుర్తిపాడు మధ్య సాగు చేసిన వరి పొలాలు దారుణంగా దెబ్బతిన్నాయి. కాల్వకు గండ్లుపడటంతో వరద నీటి ఉధృతికి పొలాలు కోతకు గురికావడంతో పాటు వందల ఎకరాల్లో ఇసుక మేట వేసింది. దీంతో కాలువ, పంటపొలాలు అన్నీ కలిసిపోయాయి. ఏది పొలమో, ఏది కాలువో తెలియని పరిస్థితి నెలకొంది.

మళ్లీ వరద వస్తే ఇబ్బందులే....

వరదలకు పడిన ఈ గండ్లను ఇప్పటివరకు పూడ్చకపోవటంతో మరలా వర్షాలకు వరద వస్తే నీరంతా పొలాలపై పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద నీటి ఉధృతి పెరిగితే సమీపంలోని గ్రామాలకు కూడా ఇబ్బంది తప్పదని వారు చెబుతున్నారు.

గండ్లు పడినచోట పెద్దపెద్ద గోతులు..

భారీ వరదకు మునేరు తువ్వకాలువకు గండ్లు పడినచోట పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ అక్కడ ఎంత లోతు నీరు ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ గండ్లు పూడ్చకపోతే ప్రభావిత ప్రాంతాల్లో రైతులు సాగుచేసే పరిస్థితి లేదు. గండ్లు పూడ్చటానికి సుమారు రూ.3కోట్ల వరకు ఖర్చవుతుందని ఇరిగేషన్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఇకనైనా ఇరిగేషన్‌శాఖ అధికారులు స్పందించి తువ్వకాలువకు పడిన గండ్లను త్వరితగతిన పూడ్చాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గండ్లు పూడ్చకపోతే సాగు లేదు...



వరదకు తువ్వకాలుకు గండ్లుపడటంతో పొలమంతా నీట మునిగి ఇసుక మేట వేసింది. గండ్లు పడినందున నీరు కూడా రావడం లేదు. గండ్లు పూడిస్తేనే సాగు చేపట్టేందుకు అవకాశం ఉంది.

ఎం.నరేంద్ర, వేములనర్వ, వత్సవాయి మండలం

పొలమంతా కోతకు గురైంది...



మా పొలం పక్కనే తువ్వకాలువకు గతేడాది గండిపడినచోటే ఈసారి కూడా గండి పడింది. 100 మీటర్ల మేర పైగా గండిపడటం పొలమంతా కోతకు గురైంది. దీంతో పంట సాగుచేసే పరిస్థితి లేదు.

ఉండెమొదలు శేషు, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు మండలం

సరస్వతీ నమస్తుభ్యం



అల్లూరులో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



పేట దుర్గాపురంలో సరస్వతీదేవి అలంకరణ



నందిగామలో శుకశ్యామలాంబ అమ్మవారు



అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



ముక్త్యాలలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

వీరులపాడు: దేవిశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వీరులపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారిని భక్తులు బుధవారం సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి అమ్మవారికి ఆలయ అర్చకులు విశేష పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరి భాస్కరరావు దంపతులు, పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం చిన్నారులకు వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. వెల్లంకిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజలు చేశారు. కుంకుమార్చన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి జన్మనక్షత్రం మూలనక్షత్రాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా ఆలయాల్లో అమ్మవారు బుధవారం సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో మూలనక్షత్ర హోమాలు, చిన్నారులకు అక్షరభ్యాసాలు నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, శ్రీకన్యకాపరమేశ్వరి, చెరువుబజారులో శ్రీరేణుకాపరమేశ్వరి, దుర్గాపురంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, ఆనందసాయి, శాంతినగర్‌లోని శ్రీకలకత్తా కాళిమాత ఆలయాలతోపాటు మార్కండేయబజారు, తోటబజారుల్లోని మండపాల్లో అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. చిన్నారులకు వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడోరోజు బుధవారం మూలానక్షత్రం రోజున పెనుగంచిప్రోలు మండలంలోని ఆయాగ్రామాల్లో అమ్మవార్లకు పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. తూర్పుబజారులో శ్రీదుర్గా మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారు శ్రీసరస్వతిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా శ్రీసరస్వతీ పూజ, కుంకుమ పూజ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయడంతో పాటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఉమాపతి, పాలకవర్గ సభ్యులు బి.శ్రీనివాసరావు, పి.వెంకటరమణ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీస్వయంభు శంభు లింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తోటచర్లలో నవరాత్రుల పందిరిలో సరస్వతీపూజ, అక్షరాభ్యాసాలు నిర్వహించారు.



చిన్నారులకు పలకలు పంపిణీ చేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: విజయదశమి పర్వదినం సందర్భంగా నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందిగామమండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, చండీసహిత రుద్రహోమం, ఖడ్గమాలార్చన తదితర పూజాది కార్యాక్రమాలను నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తిపీఠం, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాలు, లింగాలపాడు లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారు, నందిగామ రామలింగేశ్వర స్వామి ఆలయంలోని శుకశ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరి, మరిడీ మహాలక్ష్మి అమ్మవార్లను అర్చకులు సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. పలువురు దాతలు చిన్నారులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



పేట వెండిదేవాలయంలో అక్షరభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

చందర్లపాడు మండలంలో..

చందర్లపాడుతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏటూరులో వేంచేసియున్న సీతాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేటఅర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగ్గయ్యపేట మండలంలో ఆయా గ్రామాల్లో అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ముక్త్యాల భవానీముక్తేశ్వర స్వామి దేవాలయం, గౌరవరంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపంలో శ్రీసరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. తొర్రగుంటపాలెంలోని యరక్రోలు దుర్గాభవాని కూచిపూడి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు పూల సాయిదక్షిత, కంబాల యస్విని, షేక్ రేష్మ, అనంతోజు మనస్వి, చార్వి చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.అనుమంచిపల్లిలో అన్‌ప్రండ్ యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంచికచర్ల మండలంలో..



కంచికచర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కంచికచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో కనకదుర్గాదేవి అమ్మవారికి ఏడోరోజు బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శివసాయిక్షేత్రంలో అమ్మవారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సరస్వతి హోమం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమ్మవారి మండపాల వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

వివాహానికి మాజీ సీఎం జగన్‌కు ఆహ్వానం



మాజీ సీఎం జగన్‌కు వివాహ ఆహ్వానపత్రికను అందజేస్తున్న తన్నీరు కుటుంబసభ్యులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తన కుమార్తె వివాహ మహోత్సవానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. తన్నీరు నాగేశ్వరరావు కుటుంబసమేతంగా బుధవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు వివాహ ఆహ్వానపత్రికను అందించారు. ఈనెల 16వ తేదీన జరిగే తమ కుమార్తె వివాహానికి రావాలని కోరారు. తన్నీరు వెంట ఆయన భార్య సుధారాణి, కుమారుడు సాగర్, కుమార్తె సారూప్య ఉన్నారు.

మంచినీటి సరఫరా కేంద్రం పరిశీలన



తాగునీటి సరఫరాపై మున్సిపల్ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రమణబాబు

నందిగామటౌన్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన రక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. తాగునీరు సరఫరాకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం వాటర్ ట్యాంక్‌లోని నీటిని తీసుకుని స్వయంగా క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో అలసత్వం వహించొద్దని సిబ్బందికి సూచించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలి...

నందిగామటౌన్: భవన నిర్మాణదారులు అనుమతులు పొందిన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు సూచించారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అనుమతులు తీసుకున్న తరువాతనే నూతన నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించి, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రసాద్, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సిండికేటుగాళ్లు

కంచికచర్ల: టీడీపీ కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీని కాసులు కురిపించేలా మలుచుకోవడంలో అధికారపార్టీ నాయకులు సఫలీకృతమయ్యారు. ప్రభుత్వమే నూతన మద్యం పాలసీ పేరుతో మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే నెపంతో తమ పార్టీ నాయకులకే దక్కేలా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్న నేపథ్యంలో అందుకనుగుణంగానే కంచికచర్ల ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని ఆయా మద్యం దుకాణాలను కైవసం చేసుకునేందుకు పలువురు సిండికేట్‌గా మారారు. ఆయా దుకాణాల కోసం వచ్చిన దరఖాస్తులే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు. పక్కనున్న నందిగామ, జగ్గయ్యపేట ఎక్సైజ్ కార్యాలయాల పరిధిలోని దుకాణాలతో పోల్చితే సగానికి కంటే తక్కువ దరఖాస్తులే కంచికచర్ల పరిధిలోని దుకాణాలకు రావడం గమనార్హం.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి..

నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలంలో అధికార టీడీపీ నాయకులు సిండికేట్‌గా మారి మద్యం షాపులను దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికను అమలుచేస్తున్నారు. దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు...టీడీపీ కూటమి నాయకులు మద్యంషాపులు పంచుకుంటున్నారు. ఆయా మద్యంషాపులకు గతంలో మాదిరి దరఖాస్తులు రాకపోవడమే ఇందుకు నిదర్శనం కాగా, ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి టీడీపీ కూటమి నాయకులు గండి కొడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఏడు షాపులు..149 దరఖాస్తులు..

కంచికచర్ల ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో కంచికచర్ల మండలంలో ఐదు, వీరులపాడు మండలంలో రెండు మద్యం దుకాణాల లైసెన్స్‌లకు నోటిఫికేషన్ జారీచేశారు. ఈ ఏడు దుకాణాలకు సంబంధించి బుధవారం సాయంత్రానికి మొత్తం 149 అర్జీలు మాత్రమే దాఖలయ్యాయి. కంచికచర్ల మండలంలోని షాపు నంబర్ 65కు 18 దరఖాస్తులు రాగా, 66 షాపునకు 19 దరఖాస్తులు, 67వ షాపునకు 18, 68వ షాపునకు 14, 69వ షాపునకు 12 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం. వీరులపాడు మండలంలో 70వ నంబరు షాపునకు 33, 71వ షాపునకు 35 దరఖాస్తులు దాఖలయ్యాయి. వత్సవాయి మండలంలోని రెండు మద్యం దుకాణాలకే 208 దరఖాస్తులు రాగా, కంచికచర్ల ఎక్సైజ్‌శాఖ పరిధిలోని ఏడు దుకాణాలకు కూడా 149మించి దరఖాస్తులు రాకపోవడం ఇక్కడ మద్యం సిండికేట్ వ్యవహారం ఏస్థాయిలో నడుస్తోందదానికి నిదర్శనం. కంచికచర్ల మండలంలోని గొట్టుముక్కల, మోగులూరు, పరిటాల గ్రామాలకు చెందిన అధికార టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే ఈ మద్యం సిండికేట్ వ్యవహారం నడుస్తోంది. మా మాటను కాదని మద్యం షాపులను దరఖాస్తు చేసుకున్నా వ్యాపారం చేయనీయబోమని సదరు టీడీపీ నాయకులు వ్యాఖ్యానిస్తుండటంతో మద్యం షాపులకు గతంలో మాదిరి దరఖాస్తు చేసుకునేందుకు ఇతరులు ఆసక్తి చూపించడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో మద్యం షాపుల నిర్వహణ కోసం దరఖాస్తు గడువును ప్రభుత్వం మరో రెండురోజులు పొడిగించింది. ఆయా మద్యం షాపుల ఈనెల 11వతేదీ సాయంత్రం ఏడుగంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చంటూ ఎక్సైజ్‌శాఖ తాజాగా ఉత్తర్వులు జారీసిందని కంచికచర్ల ఎక్సైజ్ సీఐ అప్రఉన్నిషాబేగం తెలిపారు. 14వ తేదీన లాటరీ పద్ధతిలో దరఖాస్తుదారులకు మద్యం దుకాణాలను కేటాయింపు ఉంటుందని వివరించారు.

నందిగామ పరిధిలో 650 దరఖాస్తులు..

నందిగామటౌన్/జగ్గయ్యపేట: నందిగామ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 16 మద్యం దుకాణాలకుగాను ఇప్పటి వరకు 650 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ బంగార్రాజు తెలిపారు. స్థానిక స్టేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నందిగామ నగర పంచాయతీ, నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. బుధవారం ఒక్కరోజే 200 దరఖాస్తులు అందినట్లు ఆయన వివరించారు. ఇక జగ్గయ్యపేట పట్టణం, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లోని పది మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 560 దరఖాస్తు చేసుకున్నారు. జగ్గయపేట పట్టణంలోని నాలుగు మద్యం దుకాణాలకు 158 దరఖాస్తులు రాగా, మండలంలోని నాలుగు మద్యం దుకాణాలకు 194 దరఖాస్తులు, వత్సవాయి మండలంలోని రెండు మద్యం దుకాణాలకు 208 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీరాజ్ చట్టాలపై శిక్షణ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగమణి, పక్కన ఎంపీడీఓ శ్రీను

పెనుగంచిప్రోలు: పంచాయతీ చట్టాలపై వార్డు సభ్యులు అవగాహన ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు వారి పరిధిలో ఉండే చట్టాలు, పాలనపై అవగాహన ఉండాలన్నారు. ఎంపీడీఓ జి.శ్రీను, రిసోర్సు పర్సన్లు రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలన, వ్యర్థాల నిర్వహణ, ఆస్తుల సంరక్షణ, ఆక్రమణల తొలగింపు, వీధిదీపాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మండల పరిషత్ కార్యాలయ ఏవో కె సిద్దారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్యామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

- **నేడు మండల పరిషత్ మావేశం**

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరు కావాలన్నారు. ఆయాశాఖల అధికారులంతా తగిన సమాచారంతో హాజరు కావాలని సూచించారు.